

2

సీఎం హోదాలో అలా మాట్లాడొచ్చా

APTEL/2009/29308

స్నేహిత

# ఎక్స్‌ప్రెస్

నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక

08-04-2026
బుధవారం
హైదరాబాద్
సంపుటి: 17 I సంచిక: 165
పేజీలు: 04 I వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com



# 120 నెలల పాలనలో పినరయి విజయన్ విఫలం

## కేరళం ప్రజలను మోసం చేస్తున్నారు

ఈ రాష్ట్రంలో సరైన అవకాశాలు లేక యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారు

- వృద్ధులు, చిన్నపిల్లలే ఎక్కువగా కనిపిస్తున్నారు
- మోదీ, విజయన్‌ల మధ్య ఒప్పందం ఉంది..
- కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు
- తెలంగాణలో కేసీఆర్‌ను ఎలా మార్చారో, కేరళంలో కూడా విజయన్‌ను మార్చేస్తారు
- మూడింట రెండొంతుల మెజార్టీతో యూడీఎఫ్ గెలుస్తుంది
- కేరళ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి

కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. "పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారు" అని రేవంత్ అన్నారు.

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

కేరళం సీఎం పినరయి విజయన్ తన 120 నెలల పాలనలో పూర్తిగా విఫలమయ్యారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేరళంలో సరైన అవకాశాలు లేక యువత ఉపాధి కోసం విదేశాలకు వెళ్లారని ఆరోపించారు. కేరళంలో వృద్ధులు, చిన్నపిల్లలే ఎక్కువగా కనిపిస్తున్నారని తెలిపారు. విద్యావంతులు నైపుణ్యం కలిగిన యువత విదేశాలకు వెళ్లడం సరికాదన్న ఆయన వాళ్లు తిరిగొచ్చి ఉపాధి పొందేలా చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ మాదిరి అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చడం లాంటివి కేరళంలో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో ఏ మూలకైనా వెళ్లి తాము అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చని పినరయి విజయన్ సహా ఎల్‌డీఎఫ్ నేతలకు స్పష్టం చేశారు. ఎన్నికలు కేరళం, తెలంగాణ మధ్య కాదన్న రేవంత్ యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ మధ్య జరుగుతున్నాయని తెలిపారు. పినరయి విజయన్ పని అయిపోయిందన్న రేవంత్‌రెడ్డి, మూడింట రెండొంతుల మెజార్టీతో యూడీఎఫ్ గెలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇటీవల తనపై పినరయి చేసిన విమర్శలను రేవంత్‌రెడ్డి తోసిపుచ్చారు.

**మోడీ, విజయన్‌ల మధ్య ఒప్పందం ఉంది..**

తెలంగాణలో కేసీఆర్‌ను ఎలా మార్చారో కేరళంలో విజయన్‌ను కూడా అలా మారుస్తారని రేవంత్ రెడ్డి అన్నారు. విజయన్‌గాడ్ ఫాదర్ మోదీ దిల్లీలో ఉన్నారన్నారు. ఆయనే విజయన్‌ను కేసుల నుంచి రక్షిస్తున్నారని రేవంత్ వివరించారు. మోదీ, విజయన్ మధ్య ఒప్పందం ఉందని అనుమానం వ్యక్తం..

మిగతా 2లో...

ఈ రాత్రికే ఇరాన్

# పని ఖతం..

## దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరు

- ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుంది
- ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుంది
- ఆ దేశాన్ని తుడిచిపెట్టడం నిజానికి తనకు ఇష్టం లేదు
- ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు



**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ఇరాన్ నాగరికత మొత్తం నేటి రాత్రితో అంతమైపోతుందని అన్నారు. దానిని మళ్లీ ఎప్పటికీ పునరుద్ధరించలేరని 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు. ఇరాన్‌లో 47 ఏళ్లుగా ఉన్న అవినీతి, అరాచక పాలన అంతం కానుందని.. ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి ఓ మైలురాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆ దేశాన్ని తుడిచిపెట్టడం..

మిగతా 2లో...

# ఐఐఎస్ అధికారులు జాతీయ ఐక్యత పరిరక్షకులు

- బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వీరిది కీలకపాత్ర
- సమర్థవంతమైన కమ్యూనికేషన్ జాతీయ స్థిరత్వానికి, ప్రజల విశ్వాసానికి మూలస్థంభం
- ఐఐఎస్ ట్రైనీ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక సూచనలు



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** దేశ భద్రత, సంక్షోభ సమయాల్లో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ గందరగోళం సృష్టించే శక్తులను కుట్రలను తిప్పి కొట్టేందుకు బాధ్యతాయుతమైన సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ (ఐఐఎస్) అధికారుల పాత్ర చాలా కీలకమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అభిప్రాయపడ్డారు...

మిగతా 2లో...

తెలంగాణ ఆడిట్ శాఖ

# దేశంలోనే నెంబర్ వన్

- పనితీరు అధ్యయనానికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తాం
- అర్థం చేసుకోవడానికి అధికారులు పూర్తిగా సహకరిస్తారు
- రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అత్యంత బలంగా ఉన్నాయి
- గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని.. వరుసగా మూడుసార్లు నెంబర్ వన్ ర్యాంకు సాధించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. మంగళవారం సెక్రెటేరియట్‌లో రాష్ట్రంలో ఆన్‌లైన్ ఆడిటింగ్ వ్యవస్థను పరిశీలించేందుకు వచ్చిన గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో..

మిగతా 2లో...

# ప్రజల పక్షాన పోరాటం ఆగదు

- రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్లడం తప్పా
- అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం సరికాదు
- ప్రశ్నించే గొంతులను నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే
- ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో 1,200 ఎకరాల భూమిని లాక్కోవడం సరికాదు
- ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలి పేదల భూములపై రేవంత్ కన్ను పడింది
- ప్రభుత్వం తాటాకు చప్పళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2



2

# జైస్వాల్ ధనాధన్

ముంబయిపై రాజస్థాన్ విజయం

- వర్షం కారణంగా మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదింపు
- 27 పరుగుల తేడాతో విజయం సాధించిన రాజస్థాన్

# శబరిమలలో మహిళలపై ఆంక్షలను సమర్థించిన కేంద్రం

- మతవిశ్వాసం న్యాయ సమీక్షకు అతీతమని సుప్రీంకోర్టుకు వెల్లడి
- కేంద్రం వైఖరిని సుప్రీంకోర్టుకు తెలిపిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా
- రాజ్యాంగం మత స్వేచ్ఛను పరిరక్షిస్తుంది
- 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలి
- ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఆంక్షలు వయసు ఆధారంగా మాత్రమే ఉన్నాయి
- అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని పూర్తిగా బహిష్కరించలేదు
- మహిళా దేవతలకు నమస్కరించే ఏకైక సంస్కృతి మనదేనన్న తుషార్ మెహతా

2



# మజ్లిస్‌కు అనుకూలంగా జీహెచ్ఎంసీ ఏర్పాటు



- అసదుద్దీన్‌కు బహుమతిగా ఇవ్వడానికే మూడు భాగాలుగా విభజన
- మజ్లిస్‌ను అడ్డుకొనే సత్తా బీజేపీ మాత్రమే ఉంది
- భవిష్యత్తులో తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుంది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**రాజేంద్రనగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** మేయర్ పదవిని అసదుద్దీన్‌కు బహుమతిగా ఇవ్వడానికే జీహెచ్ఎంసీని మూడు ముక్కలుగా విభజించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శించారు. సోమవారం రాత్రి హైదరాబాద్ అత్తాపూర్ సర్కిల్ ఉప్పర్‌పల్లికి చెందిన పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మజ్లిస్‌కు అనుకూలంగా జీహెచ్ఎంసీని ఏర్పాటు చేశారన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మజ్లిస్‌ను అడ్డుకొనే సత్తా బీజేపీ మాత్రమే ఉందని పేర్కొన్నారు. ఒకప్పుడు ఒకటి రెండు సీట్లకు పరిమితమైన కమలం పార్టీ ప్రస్తుతం 20 రాష్ట్రాల్లో అధికారంలో ఉందన్నారు. భవిష్యత్తులో..

మిగతా 2లో...

# లినాక్ సేవలు పేద రోగులకు గొప్ప వరం



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో ఏటా 60 వేల కొత్త క్యాన్సర్ కేసులు నమోదు ఎంతో ఆందోళనకరమని.... అందుకే ఇకపై కేన్సర్‌ను రాష్ట్రంలో నోటిఫైబుల్ డిసీజ్ గా ప్రకటిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక ప్రకటన చేశారు. మంగళవారం నిమ్స్ క్యాన్సర్ బ్లాక్‌లో రూ. 33 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక లీనియర్ యాక్సిలరేటర్ (లినాక్) సేవలను ఆయన ప్రారంభించారు. వ్యాధి తీవ్రతను ముందే పసిగట్టేందుకు ప్రతి కేసును ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసేలా నిబంధనలు తీసుకువస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. కేన్సర్ రిజిస్ట్రీ ద్వారా ఖచ్చితమైన డేటాను సేకరించి, భవిష్యత్తులో మెరుగైన వైద్య ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ట్యూమర్‌ను మాత్రమే దెబ్బతీస్తూ ఆరోగ్యకరమైన కణాలను కాపాడే లినాక్ సేవలు నిమ్స్‌లో అందుబాటులోకి రావడం పేద రోగులకు గొప్ప వరంగా ఆయన అభివర్ణించారు. అనంతరం మహిళల క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ప్రారంభించిన మంత్రి... గర్భాశయ క్యాన్సర్ నివారణకు 1415 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించే కార్యక్రమంపై అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొని, ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసే దిశగా చేపట్టిన ఈ చర్యలను అభినందించారు. లీనియర్ యాక్సిలరేటర్ అనేది క్యాన్సర్ గడ్డలను తొలగించడానికి వాడే ఒక అత్యాధునిక రేడియేషన్ టెక్నాలజీ. సాధారణ రేడియేషన్‌లో చుట్టుపక్కల ఉండే మంచి కణాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది. కానీ, ఈ లినాక్ (ట్రూబీమ్) సిస్టమ్ కేవలం ట్యూమర్‌పై మాత్రమే హైఎనర్జీ ఎక్స్‌రేలను ప్రయోగిస్తుంది. ఈ యంత్రంతో చాలా తక్కువ సమయంలోనే ట్రీట్‌మెంట్ పూర్తవుతుంది. మెదడు, ఊపిరితిత్తులు వంటి సున్నితమైన భాగాల్లో ఉన్న కణతులను కూడా పక్కాగా నిర్మూలించవచ్చు. అపోలో, యశోద, బసవతారకం వంటి కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఇవి అందుబాటులో ఉన్నప్పటికీ, అక్కడ చికిత్స అత్యంత ఖరీదైనది.

## 120 నెలల పాలనలో పినరయి విజయన్ విఫలం

**(మొదటి పేజీ తరువాయి)**

చేశారు. కేరళంలో సక్సెస్ స్టోరీ విజయన్ పాలనలో వచ్చింది కాదని ఉమెన్‌చాందీ, కరుణాకరన్ కేరళం అభివృద్ధి కోసం బాటలు వేశారన్నారు. పినరయి విజయన్‌కు కాలం అయిపోందని అన్నారు. తెలంగాణలోని ఏ మూలకైనా వెళ్లి మేం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వారు పరిశీలించవచ్చున్నారు. ఈ విషయంలో తాను విజయన్‌కు సవాల్ విసురుతున్నానన్నారు.పినరయి విజయన్ కేరళం ప్రజలను మోసం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇందుకు సంబంధించి తాను చాలా ఆధారాలు ఇచ్చానన్నారు. వారు తెలంగాణపై(పినరయి విజయన్) తప్పుడు సమాచారం ఇస్తున్నారని అన్నారు. దీనిపై పినరయి విజయన్‌తో చర్చకు తాను సిద్ధమని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయనకు ఆదర్శవంతమైన నేతలు మోదీ, అమిత్‌షానా లేక జ్యోతిబసు, సోమనాథ్ చటర్జీనా అని ప్రశ్నించారు. విజయన్ ప్రధాని మోదీ సూచనలు తీసుకుంటున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. ఒక మోదీ ఢిల్లీ నుంచి పాలిస్తే మరో మోదీ తిరువనంతపురం నుంచి పాలిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేరళంలో విజయన్ మోడీలా పాలిస్తున్నారన్నారు. ఓట్ల కోసం మోదీలానే విజయన్ తన పేరుతో ప్రచారం చేస్తున్నారన్నారు.

## సీఎం హోదాలో అలా మాట్లాడొచ్చా

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఎప్పుడూ హుందాగా వ్యవహరించే కేరళ సీఎం విజయన్, తాజాగా తెలంగాణ సీఎం రేవంత్‌పై ఘాటుగా స్పందించారు. ఒకరకంగా చెప్పాలంటే రేవంత్ రెడ్డిని కించపరిచేలా ఉండే మలయాళ పదాలను ఉపయోగించడం కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. ఇటీవలే రేవంత్ చేసిన కామెంట్స్ తనను వ్యక్తిగతంగా, రాజకీయంగా కించపరిచేలా ఉన్నాయని భావించిన విజయన్ ఈ మేరకు తీవ్రస్థాయిలో స్పందించినట్లు తెలుస్తోంది. మంగళవారం రోజు కేరళలోని కన్నూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ సమావేశంలో విజయన్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, తనపై రేవంత్ చేసిన వ్యాఖ్యలను కేరళ ముఖ్యమంత్రి తప్పుపట్టారు. మలయాళం భాషలోని పరుష పదజాలంతో సీఎం రేవంత్‌పై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి లాంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న రేవంత్ ప్రసంగాల్లో ఇంతటి దారుణమైన భాషను ఉపయోగించొచ్చా అంటూ విజయన్ ఫైర్ అయ్యారు. సీఎం స్థాయి పదవికి తగిన ప్రమాణాలను రేవంత్ పాటిస్తున్నారా లేదా అని ఆయన ప్రశ్నించారు. కేరళ ఎన్నికల చివరి దశ ప్రచార కార్యక్రమాల హడావిడి కారణంగా రేవంత్ వ్యాఖ్యలపై స్పందించేందుకు తనకు సరిపడా సమయం లేదన్నారు. రేవంత్ రెడ్డి చేసిన అన్ని వ్యాఖ్యలపై త్వరలోనే సరైన సమయంలో స్పందిస్తానని విజయన్ వెల్లడించారు. ఒక ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన కనీస మర్యాదను ఇచ్చారా లేదా అనేది ఆత్మపరిశీలన చేసుకోవాలని రేవంత్‌కు ఆయన సూచించారు. 'దశ మోనే రేవంత' అనేది మలయాళం భాషలో వ్యంగ్య విమర్శలకు ప్రయోగించే పదం. ఇటీవలే 'నీ పో మోనే విజయ' (నీ పని అయిపోయింది. ఇక వెళ్లు విజయన్) అని సీఎం రేవంత్ విమర్శించారు. దీనికి ఇప్పుడు విజయన్ పరుష పదజాలంతో కౌంటర్ ఇచ్చారు.

**బీజేపీకి గుండు సున్నా ఖాయం..**

కేరళ ప్రజలంతా మళ్లీ సీపీఎం సారథ్యంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని సీఎం విజయన్ అన్నారు. 2021 ఎన్నికల నాటి కంటే ఎక్కువ అసెంబ్లీ సీట్లతో ఈసారి అధికారంలోకి వస్తామని విశ్వాసం వెలిబుచ్చారు. అన్నిచోట్లా కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమికి ప్రజా తిరస్కరణే ఎదురవుతోందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమి గుండు సున్నాకు పరిమితం కావడం ఖాయమని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో మాట్లాడినప్పుడు తాను ఈ అంశాలను గుర్తించానని విజయన్ తెలిపారు.

**రాహుల్, వేణుగోపాల్ ఆరోపణలన్నీ నిరాధారాలు..**

"కేరళ ఎన్నికల్లో సీపీఎం బీజేపీ మధ్య అవగాహన కుదిరిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవి. ప్రజా క్షేత్రంలో ఉన్నప్పుడు జవాబుదారీతనంతో మాట్లాడటాన్ని రాహుల్ నేర్చుకోవాలి. సీపీఎం బీజేపీ మధ్య సీక్రెట్ డీల్ కుదిరిందంటూ కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ చేసిన వ్యాఖ్యలన్నీ అవాస్తవాలు. కాంగ్రెస్ నుంచే బీజేపీలోకి ఎక్కువగా ఫిరాయింపులు జరుగుతున్నాయన్న విషయాన్ని వేణుగోపాల్ గుర్తుంచుకోవాలి. బీజేపీ ఎంపీల్లో దాదాపు 30 శాతం మంది కాంగ్రెస్ నుంచి వెళ్లిన వాళ్లే ఉంటారు. కాంగ్రెస్‌లో ఏం జరుగుతోందో వేణుగోపాల్ ఆలోచించుకుంటే మంచిది" అని కేరళ సీఎం పినరయి విజయన్ తెలిపారు.

**బీజేపీ వ్యతిరేక నిరసనల్లో కాంగ్రెస్ ఎందుకు పాల్గొనలేదు?..**

"ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసినప్పుడు, ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్ కానీ, రాహుల్ గాంధీ కానీ అస్సలు సహకారాన్ని అందించలేదు. చివరకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేసింది. ఆనాడు ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోటీ చేయడం అంటే, బీజేపీకి మద్దతు ఇచ్చినట్టు కాదా? కేంద్రంలోని బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా కేరళలో మేం నిర్వహించిన నిరసన కార్యక్రమాలకు కాంగ్రెస్, యూడీఎఫ్ కూటమి నేతలనూ ఆహ్వానించాం. కానీ వాళ్లు మా ఆహ్వానాలను తిరస్కరించారు. యావత్ కేరళ రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై మేం నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లోనూ కాంగ్రెస్, యూడీఎఫ్ నేతలు పాల్గొనకపోవడం దారుణం" అని సీఎం విజయన్ చెప్పారు.

**అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై సంప్రదింపులు**

"శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై మేం ఇకపైనా జాగ్రత్తతో కూడిన సంప్రదింపుల వైఖరినే అవలంబిస్తాం. ఎందుకంటే ఆచారాలు, సంప్రదాయాలతో ముడిపడిన ఇలాంటి సున్నితమైన అంశాల్లో కొన్ని షరతులను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వీటిపై ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం కంటే పండితులు, మేధావులు, సామాజిక సంస్కర్తలతో చర్చించడం మంచిది" అని ముఖ్యమంత్రి విజయన్ పేర్కొన్నారు.

**సహజ కారణాలతోనే రాష్ట్రంలో వరదలు..**

"కేరళను కుదిపేసిన ఆకస్మిక వరదలకు మానవ తప్పిదాలే కారణమంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మ్యాథ్యూ కుజల్ నాధన్ చేసిన ఆరోపణలు తప్పు. ఆ వరదలు మనుషుల వల్ల కాదు, కేవలం సహజ కారణాలతోనే సంభవించాయి. నిపుణులు కూడా ఈవిషయాన్ని స్పష్టంగా గుర్తించారు. సీపీఎం నుంచి వెళ్లిపోయిన సీనియర్ నేత జి సుధాకరన్ (యూడీఎఫ్ అభ్యర్థి అంబలప్పుజ) మా కూటమి అభ్యర్థిపై, మా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బాధ్యతాయుతమైన నేతలు అలా మాట్లాడరు. కాంగ్రెస్‌తో చేతులు కలిపినప్పటి నుంచి జి సుధాకరన్ రాజకీయ ప్రమాణాలను పక్కకు పెట్టి నోరు పారేసుకుంటున్నారు" అని సీఎం విజయన్ చెప్పారు.

## శబరిమలలో మహిళలపై ఆంక్షలను సమర్థించిన కేంద్రం

**నేషనల్ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 1050 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్రం సమర్థించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసానికి సంబంధించినదని పేర్కొంది. ఈ ఆంక్షలు మత స్వయం ప్రతిపత్తి పరిధిలోకి వస్తాయని, న్యాయ సమీక్ష పరిధికి అతీతమైనవని స్పష్టం చేసింది. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళ ప్రవేశంపై కేంద్రం వైఖరిని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలియజేశారు." మనం అన్ని మత విశ్వాసాలను గౌరవించాలి. ప్రతీ విషయం గౌరవానికి లేదా శారీరక స్వేచ్ఛకు సంబంధించినది కాదు. నేను ఒక గురుద్వారాకు వెళ్లినప్పుడు నా తలపై ఒక వస్త్రాన్ని కట్టుకుంటాను. అప్పుడు నేను నా గౌరవం, హక్కులు, ఇష్టాలకు భంగం కలిగిందని అనలేను" అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి తుషార్ మెహతా వెల్లడించారు.

**రాజ్యాంగం మత స్వేచ్ఛను పరిరక్షిస్తుంది : తుషార్ మెహతా..**

"నరబలి ఒక మతపరమైన ఆచారమని ఎవరైనా వాదించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద కోర్టును ఆశ్రయిస్తే అది మతపరమైన సంప్రదాయమా లేదా ఆవశ్యకమైన ఆచారామా అని కోర్టు పరిశీలించాల్సిన అవసరం లేదు. ప్రజా భద్రత, నైతికతను నేరుగా ఉల్లంఘిస్తుందనే కారణంతో ఆ పిటిషన్‌ను నేరుగా తిరస్కరించవచ్చు. రాజ్యాంగం మత స్వేచ్ఛను పరిరక్షిస్తుంది. ఎందుకంటే మతాల్లో మెజారిటీ ప్రజల అభిరుచికి సంబంధించిన లౌకిక ప్రమాణాలను సంతృప్తిపరచని నమ్మకాలు, ఆచారాలు, ఆరాధనా రూపాలు ఉండొచ్చు. రాజ్యాంగంలో రాజ్యాంగ నైతికత గురించి కచ్చితంగా నిర్వచించలేదు. మతపరమైన విషయాలు, పవిత్ర గ్రంథాలు, శాస్త్రాలు, గ్రంథాలు మొదలైన వాటిపై న్యాయస్థానానికి పూర్తి అవగాహన ఉండకపోవచ్చు. ప్రతి మతానికి దాని విభిన్న విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగానికి వారి సొంత విశ్వాసంపై నమ్మకం ఉంది" అని తుషార్ మెహతా స్పష్టం చేశారు.

**'ఆ తీర్పును మళ్లీ పరిశీలించాలి'..**

అన్ని వయసుల మహిళలను శబరిమల ఆలయంలోకి అనుమతిస్తూ 2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పున:సమీక్షించాలని తుషార్ మెహతా కోరారు. గుడిలోకి మహిళల ప్రవేశంపై నిషేధం అంటరానితనానికి సమానమని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 17ను ఉల్లంఘిస్తుందని అప్పట్లో సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్యానించిందని, ఈ విషయంపై తనకు చాలా అభ్యంతరాలు ఉన్నాయన్నారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై ఆంక్షలు కేవలం వయసు ఆధారంగా మాత్రమే ఉన్నాయని వెల్లడించారు. అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని పూర్తిగా బహిష్కరించలేదని చెప్పారు. మహిళా దేవతలకు నమస్కరించే ఏకైక సంస్కృతి మనదేనని అన్నారు.

**న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు..**

ఈ క్రమంలో తుషార్ మెహతా వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న స్పందించారు. ఒక నెలలో మహిళలకు మూడు రోజులు అంటరానితనం ఉండి, నాలుగో రోజు అంటరానితనం ఉండదని అనుకోవడానికి వీల్లేదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 గురించి ఆమె ప్రస్తావించారు. అంటరానితనానికి అధిగమించడానికే ఆర్టికల్ 17ను ప్రాథమిక హక్కుగా చేశారని గుర్తు చేసుకున్నారు."ప్రతి నెలా మూడు రోజుల పాటు మహిళలపై అంటరానితనం ఉండి, నాలుగో రోజున అది పోతుందని చెప్పలేం. ఇది కఠిన వాస్తవం. నేనొక మహిళగా చెబుతున్నాను. ఆర్టికల్ 17 కేవలం మహిళలకు మూడు రోజులకే వర్తించి, నాలుగో రోజున వర్తించకపోవడం అనేది సాధ్యం కాదు" అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న తెలిపారు.

**అసలేంటీ కేసు?**

శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 1050 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని 2018లో రద్దు చేసింది ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం. 4:1 మెజారిటీతో ఈ సంచలన తీర్పునిచ్చింది. శతాబ్దాల నాటి ఈ హిందూ మత ఆచారం చట్ట, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దేశ అత్యున్నత న్యాయస్థానంలో దాఖలు అయ్యాయి. ఈ క్రమంలోనే 9 మంది సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తాజాగా పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఈ క్రమంలో శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళల ప్రవేశంపై తన వైఖరిని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలియజేసింది.

## 30 వేల యువ రైతులకు సాయిల్ హెల్త్ వాలంటీర్ శిక్షణ

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాష్ట్రంలో ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు అధికంగా పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. రైతుల సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి సచివాలయం నుంచి హాజరై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడి యూరియా యాప్ పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్‌తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, ఇంట్లో నుంచే యూరియాను బుక్ చేసుకోని, ఉచిత సమయంలో తెచ్చుకునేందుకు వీలు కలిగిందని, దీంతో సమయం వృథా కాకుండా ఉందని రైతులు యూరియా యాప్‌ని కొనియాడారు. రాష్ట్రంలో సాగు అవుతున్న వివిధ పంటల్లో విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతిని, పంట దిగుబడులు తగ్గుతుండటంతో ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని, సిఫార్సుల మేరకు నేల స్వభావానికి అనుగుణంగా శాస్త్రీయంగా ఎరువులు వినియోగించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నదన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా భూసార పరీక్షల అనంతరం రైతులకు అందించే నేల ఆరోగ్య కార్డులో పొందుపరిచిన వివరాలను సులభంగా అర్థమయ్యేలా వివరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది యువ రైతులను వాలంటీర్లుగా ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నట్టు, ప్రతి గ్రామంలో ఇద్దరు నుంచి ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**అన్ని పంటల్లో పామాయిల్ వేయొచ్చు**

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, వాటి ఫలితాల అర్థం చేసుకోవడం, పంటలకు అనుగుణంగా ఎరువుల వినియోగం వంటి అంశాలపై ఈ వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ అందచేస్తున్నామని, రాష్ట్రంలోని రైతు విజ్ఞాన కేంద్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధనా కేంద్రాల్లో రోజుకు సుమారు వెయ్యి మందికి శిక్షణ అందిస్తూ, నెలరోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూసార పరీక్షా కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధనా ల్యాబ్‌లతో పాటు మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌లను వినియోగిస్తూ భూసార పరీక్షలను వేగవంతం చేస్తున్నామన్నారు. దీంతో రైతులు శాస్త్రీయంగా ఎరువులు వినియోగించి నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందన్నారు. రైతులు తాము పండించే అన్ని పంటల్లో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని, పామాయిల్ పంటను వేసి కూడా వరి, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు పండించుకోవచ్చని వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలు ఉంటుందన్నారు.

**తుమ్మలను కలిసిన ఆ పాలకవర్గం..**

సచివాలయంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్ లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.

## ఇక నుంచి రాత్రి సమయాల్లోనూ నీటి సరఫరా..

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రాబోయే 60 రోజులు తాగునీరు సరఫరా చేసేందుకు క్షేత్ర స్థాయిలో అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏ ప్రాంతంలోనైనా సప్లైలో తక్కువ నీరుంటే.. సర్దుబాటు చేసేలాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరా చేసేటప్పుడు సమయ పాలన పాటించాలన్నారు. ఒకవేళ అందులో ఏవైనా ఇబ్బందులు ఉంటే ముందుగా ప్రజలకు సమాచారమివ్వాలని తెలిపారు. వేసవి తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా విధానాన్ని, ప్రస్తుత డిమాండ్‌సప్లై పరిస్థితులను, వివిధ జలాశయాలలో ఉన్న నీటి నిల్వలు, పంపింగ్ సామర్థ్యం, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై ట్రాన్స్‌మిషన్, ఓఅండ్‌ఎమ్ విభాగాల ఉన్నతాధికారులతో ఎండీ సమీక్షించారు. అంగీకరించిన నీటిని సరఫరా కంటే అందనగా సప్లై అవుతున్న నీటిని తగ్గించి తక్కువగా అందుతున్న ప్రాంతాలను గుర్తించి , సమతుల్య పంపిణీకి తక్షణ చర్యలు చేపట్టాలని ట్రాన్స్ మిషన్ అధికారులను ఆదేశించారు. అధికంగా నీరు అందుతున్న ప్రాంతాల్లో సరఫరాను సర్దుబాటు చేసి, తక్కువగా అందుతున్న ప్రాంతాలకు మళ్లించడం ద్వారా ప్రతి ప్రాంతానికి సమానంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల వాల్వ్ ఆపరేషన్లు పునః సమీక్షించి, సప్లై సమయాలను పునర్వ్యవస్థీకరించాలని పేర్కొన్నారు. లీకేజీలు, అనధికార కనెక్షన్లు, నీటి వృధాను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలని ఎండీ ఆదేశించారు. పంపింగ్ స్టేషన్లు, రిజర్వాయర్లు, కీలక సరఫరా లైన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా కొనసాగించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని డిమాండ్‌ను అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. నగరంలో ఇప్పటికే 1250 ట్యాంకర్లు, 90 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు, 145 ఫిల్లింగ్ పాయింట్స్ ఉండగా.. డిమాండ్‌ని బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్ కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రతి జీఎం.. సక్రమ నీటి సరఫరాకు ట్రాన్స్ మిషన్ అధికారుల సమన్వయంతో ఇన్ ఫ్లో ను పర్యవేక్షించాలని తెలిపారు. డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా.. ఇక నుంచి రాత్రి సమయాల్లోనూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. పగటి వేళల్లో గృహ అవసరాలకు.. రాత్రి వేళ కమర్షియల్ అవసరాలకు ట్యాంకర్లను డెలివరీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలు జలమండలి సరఫరా చేసే నీటిని తాగడానికి కాకుండా ప్రాంగణాలు, వాహనాలు కడగడానికి.. ఇతర అవసరాలకు నీటిని వృధా చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని.. అలాగే తాగునీటి సరఫరా సమయాల్లో కొంత మంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జలమండలి ఈడీ సామ్రాట్ అశోక్, ఆపరేషన్ డైరెక్టర్, నారాయణ, సీజీఎంలు, రెవెన్యూ, ఐటీ విభాగపు అధికారులు పాల్గొన్నారు.

## ఈ రాత్రికే ఇరాన్ పని ఖతం..

**(మొదటి పేజీ తరువాయి)**

నిజానికి తనకు ఇష్టం లేదని.. కానీ ఆ విధంగా చేయక తప్పట్లేదని పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో కొత్త, తెలివైన నాయకత్వం వచ్చిందని, దాని వల్ల అద్భుతాలు జరిగే అవకాశం కూడా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరాన్ హర్మూజ్‌ను తెరవకపోతే ఆ దేశంలోని ఇరాన్‌లో వంతెనలు, విద్యుత్కేంద్రాలను లక్ష్యం చేసుకుంటామని సోమవారం ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ అమెరికా ప్రతిపాదనలను ఇరాన్ తిరస్కరించడంతో.. ట్రంప్ తాజాగా మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్‌లోని పౌర, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే.. అంతర్జాతీయ నేరంగా పరిగణిస్తామని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ హెచ్చరించినప్పటికీ అమెరికా దాడులు కొనసాగిస్తోంది.

**50 లక్ష్యాలపై దాడులు..**

ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌లో ఉన్న దాదాపు 50 లక్ష్యాలపై తమ దళాలు దాడులు జరిపినట్లు అమెరికా వెల్లడించింది. అక్కడి రక్షణ వ్యవస్థలపై కూడా దాడులు చేసినట్లు తెలిపింది. ఈ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడానికి మెరైన్‌లతో ఆపరేషన్ చేపట్టడానికి అగ్రరాజ్యం యోచిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌లోని పలు ప్రాంతాల్లోనూ అమెరికాఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి.

**ఇరాన్ దెబ్బ రుచి చూస్తారు..**

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ స్పందించింది. ఈ రాత్రికి ఇరాన్ నాగరికత తుడిచి పెట్టుకోబోతోందంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టింది. అమెరికా, దాని మిత్రదేశాలే పురాతన నాగరికత కలిగిన ఇరాన్ నుంచి మరిచిపోలేని దెబ్బను రుచి చూస్తారంటూ పేర్కొంది. ఈ మేరకు దక్షిణ ఆఫ్రికాలోని ఇరాన్ ఎంబసీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది.

## తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నెంబర్ వన్

**(మొదటి పేజీ తరువాయి)**

అన్ని వ్యవస్థలు అత్యంత బలంగా ఉన్నాయని డిప్యూటీ సీఎం గుజరాత్ అధికారులకు వివరించారు. ఆడిట్ శాఖ పనితీరు అధ్యయనానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని.. అర్థం చేసుకోవడానికి అధికారులు పూర్తిగా సహకరిస్తారని గుజరాత్ అధికారులకు డిప్యూటీ సీఎం వెల్లడించారు. రెండు రోజులుగా రాష్ట్రంలోని పలు గ్రామపంచాయతీలను సందర్శించి ఆన్‌లైన్ వ్యవస్థను అధ్యయనం చేస్తున్నామని గుజరాత్ అధికారులు తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ ఆడిట్ శాఖ డైరెక్టర్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన పోరాటం ఆగదు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం పరికిపంద చర్య అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్లడం తప్పా అని నిలదీశారు. అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాడ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుండి 1,200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలి పేదల భూములపై పడిందని ఆరోపించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూసేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తున్నదని.. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని.. ఉద్యమ కాలం నుండే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని.. ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు.

## ఐఐఎస్ అధికారులు జాతీయ ఐక్యత పరిరక్షకులు

**(మొదటి పేజీ తరువాయి)**

ఐఐఎస్ అధికారులు సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదని, సమాచార సమగ్రతకు, జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలని సూచించారు. యుద్ధం చేయకుండా సమాచార వ్యాప్తి ద్వారా శత్రువులను మనసులను ప్రభావితం చేయడంలో టీవీ, రేడియో సహా మీడియా సైకలాజికల్ ఆపరేషన్స్ నిర్వహిస్తూ ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు. బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో ఐఐఎస్ అధికారులు అగ్రభాగాన నిలవాలని కోరారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ 2009, 2023, 2024 బ్యాచ్ లకు చెందిన గ్రూప్ ఏ ట్రైనీ అధికారులు ఈ నెల 15 నుంచి 22 వరకు అంతర్గత భద్రత, సంక్షోభ, విపత్తు కమ్యూనికేషన్, సైకాలజికల్ ఆపరేషన్స్‌పై అవగాహన పెంపొందించుకునేందుకు శిక్షణ పొందారు. మంగళవారం ఢిల్లీలోని కర్తవ్య భవన్‌లో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేగంగా మారుతున్న సమాచార ప్రపంచంలో సమర్థవంతమైన కమ్యూనికేషన్ కేవలం పరిపాలనా సాధనం మాత్రమే కాదని, జాతీయ స్థిరత్వానికి, ప్రజల విశ్వాసానికి మూలస్థంభమని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రజలను తప్పుదారి పట్టించే ఫేక్ సమాచారం సవాల్ విసురుతున్న నేటి తరుణంలో వాటిని అధిగమిస్తూ ప్రజలను చైతన్యం చేసేందుకు ఏం చేయాలనే దానిపై ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్స్, సెంట్రల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ అందించే ప్రత్యేక శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య మధ్యవర్తిగా పనిచేసేలా సిద్ధం కావాలని సూచించారు. దేశం తమ మీద ఆశలు పెట్టుకుంది. కేవలం సమాచార మాధ్యమకారులుగా మాత్రమే కాదు. సమాచార సమగ్రతకు (ఇన్ఫర్మేషన్ ఇంటెగ్రిటీ), జాతీయ ఐక్యత పరిరక్షకులుగా నిలవాలని సూచించారు. బలాన్ని కాకుండా మేధస్సును ఉపయోగించి చేసే సమాచార యుద్ధంలో అగ్రభాగంలో ఉండలన్నారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అంద్ర వంశీ, కేంద్ర హోంశాఖ మీడియా విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ రాజ్ కుమార్, ఐఐఎస్ విభాగం కోర్స్ డైరెక్టర్ రష్మీ రోజా తుషార నాయర్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్లిస్‌కు అనుకూలంగా జీహెచ్ఎంసీ ఏర్పాటు

**(మొదటి పేజీ తరువాయి)**

తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన యువకులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రూరల్ జిల్లా అధ్యక్షుడు పి.రాజ్‌భూపాల్‌గౌడ్, టి.శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీధర్, బి.బాల్‌రెడ్డి, ఎన్.మల్లారెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, ఎస్.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జైస్వాల్ ధనాధన్.. ముంబయిపై రాజస్థాన్ విజయం

**గౌహతి :** ఐపీఎల్ 2026లో భాగంగా ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ 27 పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ 3 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (77*; 32 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. వైభవ్ సూర్యవంశీ (39; 14 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌లు) సత్తా చాటాడు. లక్ష్యఛేదనలో ముంబయి 123/9కి పరిమితమైంది. రూథర్‌ఫోర్డ్ (25), నమన్ ధీర్ (25), తిలక్ వర్మ (14) పరుగులు చేశారు. రికెల్టన్ (8), రోహిత్ శర్మ (5), సూర్యకుమార్ యాదవ్ (6), హార్దిక్ పాండ్య (9) నిరాశపర్చారు. రాజస్థాన్ బౌలర్లలో నంద్రీ బర్గర్, రవి బిష్ణోయ్, సందీప్ శర్మ రెండేసి వికెట్లు పడగొట్టగా.. జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే ఒక్కో వికెట్ తీశారు.



# అంగరంగ వైభవంగా బేతాళ స్వామి ఎడ్ల బండ్ల ప్రదక్షణ



**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మెదక్ జిల్లాలోని ఏడుపాయల జాతర తర్వాత రెండో అతి పెద్ద జాతర అయిన అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఐదవ రోజు ప్రధాన ఘట్టమైన ఎడ్లబండ్ల ప్రదక్షణ అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక భక్తులే కాకుండా,వివిధ గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్ల బండ్లను పోటాపోటీగా వివిధ రకాలుగా సుందరంగా అలంకరించి డప్పు వాయిద్యాలు, ఆటపాటలతో గ్రామపుర వీధుల గుండా స్వామి వారి ఆలయానికి చేరుకొని బేతాళ స్వామికి గోవిందా.. గోవిందా అంటూ భక్తి పారవశ్యంతో స్మరించుకుంటూ వివిధ రకాల ఆట పాటలు, విన్యాసాలతో ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేసి స్వామివారికి ఎడ్లబండ్ల మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలను తిలకించడానికి చుట్టుప్రక్కల ప్రాంతాల ప్రజలే కాకుండా కర్ణాటక మహారాష్ట్ర నుండి భారీ సంఖ్యలో వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అసౌకర్యం ఆలయ కమిటీ పలు ఏర్పాట్లుచేసింది. సిఐ రేణుక రెడ్డి, ఎస్సై శంకర్ ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను ప్రశాంతంగా జరిపేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వేలాది మంది భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం జన జాతరగా కిక్కిరిసిపోయింది.

**వేలాదిగా తరలివచ్చిన భక్తులు**




---




## ఆర్టిఐ బోర్డుకు మోక్షం.. ప్రజలకు సమాచార భాగ్యం!

- **ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఆర్టిఐ బోర్డు ఏర్పాటు చేయండి..ఎస్.హెచ్.విఎస్**
- **ములుగు జిల్లా అధ్యక్షులు సర్వేశ్వరరావు**

**వాజేడు,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వాజేడు మండలం పేరూరు గ్రామ పంచాయతీ నూతన పంచాయతీ కార్యదర్శి మహేష్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే పారదర్శకతకు పెద్దపీట వేస్తూ తీసుకున్న చర్యలు ఇప్పుడు పేరూరులో చర్చనీయాంశంగా మారాయి. పేరూరు పంచాయతీ కార్యాలయం వద్ద పాతబడి,అస్పష్టంగా ఉన్న సమాచార హక్కు చట్టం2005 బోర్డును గమనించిన మహేష్,తక్షణమే తొలగించి ప్రజలకు సమాచార అధికారులు మరియు నిబంధనలు స్పష్టంగా తెలిసేలా వివరాలతో కూడిన నూతన బోర్డును ఏర్పాటు చేయించారు.మండలానికే ఆదర్శం ఈ చొరవపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేరూరు పంచాయతీని ఆదర్శంగా తీసుకుని వాజేడు మండలంలోని మిగిలిన అన్ని గ్రామ పంచాయతీల్లో కూడా ఇలాగే నూతన సమాచార బోర్డులను తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "సమాచార హక్కు చట్టం అమలులో సెక్రటరీ మహేష్ చూపిన చొరవ అభినందనీయం..ఈ చిన్న మార్పు ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు నమ్మకాన్ని పెంచుతుందని,మిగిలిన పంచాయతీలు కూడా దీనిని అనుసరించాలని కోరుతున్నారు.

## సెల్ టవర్ ఎక్కితే జైలు ఖాయం

### మద్యం మత్తులో హంగామా చేసిన వ్యక్తికి 7 రోజుల జైలు శిక్ష

### ఎస్ఐ భరత్ భూషణ్



**మోమిన్‌పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చట్టాన్ని తుంగలో తొక్కుతూ ప్రజల్లో భయం కలిగించే చర్యలకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన మహంతు మధుకర్ రెడ్డి (తండ్రి మల్లా రెడ్డి) ఈ నెల 28న తన స్నేహితుడితో గొడవపడిన అనంతరం న్యాయం కోసం మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాడు. పోలీసులు చట్టపరంగా సమస్య పరిష్కారం పొందవచ్చని సూచిస్తూ, చట్ట విరుద్ధ చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.అయితే, హెచ్చరికలను లెక్కచేయకుండా మధుకర్ రెడ్డి మద్యం మత్తులో మోమిన్‌పేట్ గ్రామంలోని సెల్ టవర్ పైకి ఎక్కి, చేతిలో మద్యం బాటిల్ పట్టుకుని మద్యం సేవిస్తూ "చనిపోతాను" అంటూ ప్రజల్లో తీవ్ర భయాందోళనలు సృష్టించాడు.ఈ ఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు.ఈ సంఘటనపై మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ భరత్ భూషణ్ కేసు నమోదు చేసి చర్యలు ప్రారంభించారు.అనంతరం కేసు విచారణ జరిపిన వికారాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ రెండో తరగతి కోర్టు న్యాయమూర్తి మాయబ్రహ్మ నర్సింహ మధుకర్ రెడ్డికి 7 రోజుల జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించారు.

**పోలీసుల హెచ్చరిక:**

సెల్ టవర్‌లపైకి ఎక్కడం,ప్రజల్లో భయం కలిగించడం, మద్యం మత్తులో అల్లర్లు సృష్టించడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలు. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని పోలీసులు స్పష్టం చేశారు.

**ప్రజలకు గట్టి హెచ్చరిక:**

సెల్ టవర్ ఎక్కడం సరదా కాదు... ప్రాణాపాయం మాత్రమే కాదు,నేరం కూడా..!కాబట్టి ఇలాంటి పనులు చేస్తే జైలు శిక్ష తప్పదని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

## దాహార్తి తీర్చిన సర్పంచ్

**రాయికల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని దావనపల్లి గ్రామ ఫారెస్టులో వన్యప్రాణుల కోసం దాహార్తి తీర్చడానికి ఫారెస్టులో సిమెంట్ తొట్టెలు నిర్మించి నీళ్లు నింపిన దావనపల్లి గ్రామ సర్పంచ్ మలవత్ ప్రసాద్. వేసవి కాలంలో జంతువులకు ఎక్కడ నీరు దొరకక అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామాలలోకి అడవి జంతువులు వచ్చి గ్రామ ప్రజలు భయందోళనకు గురి కాకుండా నీటి తోట్టెలు నిర్మించి వన్య ప్రాణుల దాహం తీర్చడానికి చేసిన ప్రయత్నాన్ని ఉప సర్పంచ్ భానోత్ రవి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నరేష్, బీట్ ఆఫీసర్ మహమ్మద్ షేక్ పాషా,గ్రామ ప్రజలు అభినందించారు.



## ఎంఈఓ ఏకపక్ష నిర్ణయాలపై ఆగ్రహం

**ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్**

- జనగణన విధుల కేటాయింపులో వివక్ష ఆరోపణలు
- ఒకే సంఘానికి అనుకూలంగా నిర్ణయాలు?
- సీనియర్ ఉపాధ్యాయులను పక్కన పెట్టడంపై ఆగ్రహం
- అన్ని సంఘాలతో చర్చించి విధులు కేటాయించాలని డిమాండ్
- తపస్ పెద్దేముల్ మండలం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల అనిల్ కుమార్

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండల విద్యా అధికారి (ఎంఈఓ) నర్సింగ్ రావు జనగణన విధుల కేటాయింపులో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఆరోపిస్తూ ఆయనపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని తపస్ పెద్దేముల్ మండల ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా పట్లోళ్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ..జనగణన విధుల కేటాయింపులో ఎంఈఓ నర్సింగ్ రావు ఒకే సంఘానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఆ సంఘానికి చెందిన ఉపాధ్యాయుల పేర్లను మాత్రమే సిఫార్సు చేయడం ద్వారా స్పష్టమైన పక్షపాతం కనిపిస్తోందని విమర్శించారు. అంతేకాకుండా,సంఘ ప్రధాన బాధ్యులైన ఇద్దరిని రిజర్వులో ఉంచడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక గ్రామంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను పక్కన పెట్టి ఇతరుల పేర్లను పంపడం తగదని హితవు పలికారు. అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి విధులను కేటాయించాలని సూచించినప్పటికీ,ఎంఈఓ ఇష్టానుసారంగా పేర్లు పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రతి నిర్ణయం ఎంఈఓ తీసుకుంటూ,బాధ్యతను తహశీల్దార్‌పై నెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే తపస్ సంఘం తరపున తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేసినట్లు గుర్తు చేస్తూ,ఎస్జీటీలకు ఎన్యూమరేటర్లుగా,పీఎస్‌హెచ్ఎంలకు సూపర్వైజర్‌లుగా విధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు.అయినప్పటికీ సీనియర్ ఉపాధ్యాయుల పేర్లను పరిగణలోకి తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు.ఏకపక్ష నిర్ణయాలకు తెరదించాలని,అన్ని ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అందరికీ న్యాయం జరిగేలా విధుల కేటాయింపు జరగాలని తపస్ సంఘం తరపున అనిల్ కుమార్ డిమాండ్ చేశారు.



# ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం: పట్లోల సుధాకర్ రెడ్డి



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి సౌకర్యాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోల సుధాకర్ రెడ్డి తెలిపారు.మండలంలోని బాణపురం గ్రామంలోని బుడగ జంగం కాలనీలో ఎమ్మెల్యే పట్లోల సంజీవ రెడ్డి ఆదేశాల మేరకు బోర్ వేయించగా, పుష్కలంగా నీరు రావడంతో కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం సర్పంచ్ అనిల్ బోర్‌కు పూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మరియు నాయకులు పాల్గొన్న కార్యక్రమంలో స్థానిక ప్రజలు నాయకులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు విష్ణువర్ధన్ రెడ్డి,మోహన్ రెడ్డి, బాణపురం రాజు ముదిరాజ్,మహేష్ చౌహాన్,గోపాల్ రెడ్డి, కౌన్సిలర్ షారుఖ్ ఖాన్,మాజీ ఎంపీటీసీ ముంతాజ్, ఉపసర్పంచ్ శంకర్,వార్డ్ సభ్యులు దుర్గయ్య, మల్లన్న, విఠల్ యాదవ్,అడివప్ప పటేల్, యాకోబు,ఆకాష్ (యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు),డప్పు సాయిలు, కేశయ్య,లక్ష్మణ్,సాయిలు,చిన్న లక్ష్మణ్,రాములు తదితరులు పాల్గొన్నారు.







## మొరంగపల్లిలో

# అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నిత్యమాల కార్యక్రమం

## ప్రజల ఐక్యతకు నిదర్శనం

### 7వ రోజు పూల మాల సమర్పించిన వార్డు మెంబర్ తలారి రాజేష్

**మోమిన్ పేట్,స్నేహిత ఎక్స్ ప్రెస్:***

మొరంగపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి కొనసాగుతున్న నిత్యమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా 8వ వార్డు సభ్యులు మరియు బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తలారి రాజేష్ 7వ రోజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన అవసరం ఉందని, సమాజంలో సమానత్వం నెలకొల్పడానికి ఆయన చూపిన మార్గం ఎంతో గొప్పదని పేర్కొన్నారు.అలాగే ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అరుణ బిచ్చయ్య, కాంగ్రెస్ నాయకుడు వెంకయ్య, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు నర్సింలు,ఉపాధ్యక్షుడు,సంఘ సభ్యులు,గ్రామ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో ఐక్యత, సామాజిక చైతన్యం స్పష్టంగా కనిపించిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

**ప్రత్యేకత:**

**నిత్యమాల కార్యక్రమం ద్వారా అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా చాటుతూ.. యువతలో చైతన్యం పెంచుతున్న ఈ కార్యక్రమం గ్రామానికి ఆదర్శంగా నిలుస్తోంది.**

## నేడు పెద్దేముల్ మండలానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి రాక

- పెద్దేముల్ మండలంలో పర్యటించనున్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి
- కోట్ల రూపాయల పనులకు శంకుస్థాపనలు
- గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నేడు(బుధవారం )తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పెద్దేముల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. అందులో భాగంగా ఉదయం 11:30 గంటలకు పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడను ప్రారంభించనున్నారు.అనంతరం మధ్యాహ్నం



1:30 గంటలకు STSDF నిధులతో సుమారు రూ.3 కోట్ల రూపాయల వ్యయంతో పెద్దేముల్ మండలం బుద్దారం నుండి పెద్దేముల్ తండా కెనాల్ వరకు బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు.అలాగే మధ్యాహ్నం 2:15 గంటలకు STSDF నిధులతో 1.3 కోట్ల రూపాయల వ్యయంతో పెద్దేముల్ మండలం బాయిమీది తండా నుండి షాదీపూర్ గ్రామం (కర్ణాటక) వరకు రోడ్డు పనులను ప్రారంభించనున్నారు.ఈ కార్యక్రమాలకు పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు,ఆయా శాఖల అధికారులు,ఆయా గ్రామాల ప్రజలు,తదితరులు పాల్గొననున్నారు.

## గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్



**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ గ్రంథాలయాన్ని మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగ యువతతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలను శ్రద్ధగా విన్న చైర్మన్ నాగేష్ శెట్కార్, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రంథాలయంలో సౌకర్యాల మెరుగుదలపై కూడా అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ సురేఖ,6వ వార్డు కౌన్సిలర్ లక్ష్మణ్, 13వ వార్డు కౌన్సిలర్ వివేకానంద మహేందర్, మైపాల్ రెడ్డి, పాండు,సురేష్ శెట్ తదితరులు పాల్గొన్నారు.



## అల్లాదుర్గం పి.హెచ్.సి జడ్పీ సీఈవో తనిఖీలు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** మండలంలోని పీహెచ్సీ, ఎంపీపీ కార్యాలయాలను జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్య సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎంపీపీ కార్యాలయ రికార్డులను,పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అధికారులు సమయపాలన పాటించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.కార్య క్రమంలో తహశీల్దార్ మల్లయ్య,ఇన్చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు వినడానికి వెళితే అరెస్టులా ?



- రైతుల సమస్యలు తెలుసుకోవడమే నేరమా?
- ప్రజాస్వామ్య విలువలను అవమానించిన ప్రభుత్వం
- రైతుల పక్షాన నిలబడే నేతలపై దమనకాండ
- పరిగి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగింపు
- తెలంగాణ ఉద్యమ కారుడు వెంకటేష్ చారి ఆగ్రహం

**పెద్దేముల్,స్నేహిత ఎక్స్ ప్రెస్**

వికారాబాద్ జిల్లా పరిగి ప్రాంత రైతుల సమస్యలను తెలుసుకుని వారికి మద్దతు ప్రకటించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తెలంగాణ ఉద్యమకారుడు వెంకటేష్ చారి తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు ఆయన మంగళవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమ కారుడు వెంకటేష్ చారి మాట్లాడుతూ..మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్ పటేల్, బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల అనిల్ రెడ్డి,తాండూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజు గౌడ్, శ్రీనివాస్ చారి,పట్లోళ్ల నర్సింహులు తదితరులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల సమస్యలను వినడానికి వెళ్లే నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని,ఇది ప్రభుత్వ అసహనానికి నిదర్శనమని విమర్శించారు.రైతులు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలబడాల్సిన ప్రభుత్వం, సమస్యలను లేవనెత్తే వారిపై చర్యలు తీసుకోవడం అన్యాయమని మండిపడ్డారు. ప్రజల సమస్యలను వినిపించే హక్కును కూడా హరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. పరిగి రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని వెంకటేష్ చారి స్పష్టం చేశారు.

## ఆయిల్ ఫామ్ సాగులో శ్రమ,పెట్టుబడులు తక్కువ లాభాలెక్కువ

- 90 శాతం ప్రభుత్వ సబ్సిడీతో పంట సాగుకై స్పింకర్లు
- రైతు భరోసాతో పాటుగా రూ.42 వేల పెట్టుబడి సాయం
- 3 సం.ల వరకు అంతర పంటల సాగుకు అనుకూలం
- పోతంగల్లో ఆయిల్ ఫామ్ పంట సాగుపై రైతులతో అవగాహన

**కోటగిరి,స్నేహిత ఎక్స్ ప్రెస్:**




ఆయిల్ ఫామ్ పంట సాగులో రైతులకు శ్రమ,పెట్టుబడులు తక్కువగా ఉండి అత్యధిగా లాభాలను ప్రయోజనాలను పొందవచ్చని పోతంగల్ మండ ల వ్యవసాయ అధికారి నిశిత అలాగే ఉద్యానశాఖ అధికారి వహీద్ పేర్కొన్నారు. మంగళవారం పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల రైతాంగానికి ఆయిల్ ఫామ్ పంట సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నిశిత,వహీద్ మాట్లాడుతూ..ఆయిల్ ఫామ్ పంట వేసిన మొదటి మూడు సం.ల వరకు అంతర పంటలు అనగా కూరగాయలు,శెనగ,జొన్న,వరి,ఆకుకూరలు,కందులు మొదలైనవి సాగు చేసుకొని లాభాలను ఆర్జిస్తూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలైన రైతు భరోసాతో పాటుగా అదనంగా ఎకరానికి రూ.4200 చొప్పున పెట్టుబడి సహాయం పొందవచ్చన్నారు.ఈ పంట కాల పరిమితి 30 సం.ల వరకు ఉంటుందనీ, పెట్టుబడి,శ్రమ తక్కువగా ఉండి అధిక లాభాలు పొందవచ్చన్నారు.ఈ పంట సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ఒక మొక్క కేవలం రూ 20 అలాగే డ్రిప్ కు 90 శాతం సబ్సిడీ అందిస్తుందనీ, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపు నిచ్చారు.ఈ ఆయిల్ పామ్ పంట సాగు చేయదలచిన ఔత్సాహిక రైతులు ఆయా క్లస్టర్ల పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ క్లస్టర్ ఆఫీసర్,వ్యవసాయ విస్తరణ అధికారులు,రైతులు పాల్గొన్నారు.



## జాతరలో భక్తులకు అన్నదానం నిర్వహించిన పూర్వ విద్యార్థులు

**అల్లాదుర్గం,స్నేహిత ఎక్స్ ప్రెస్:** ప్రసిద్ధి చెందిన బేతాళ స్వామి జాతర ఉత్సవాలలో భక్తుల సౌకర్యార్థం మంగళవారం పూర్వ విద్యార్థులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సమాజానికి సేవ చేయడానికి తమ వంతు సహకారం అందిస్తామని అల్లాదుర్గం ప్రభుత్వ పాఠశాలలో 1996..97 పూర్వ విద్యార్థులు ఆదర్శంగా నిలిచారు. జిల్లాలో పేరుగాంచిన అల్లాదుర్గం బేతాళ స్వామి జాతర ఉత్సవాలలో భాగంగా ప్రధాన ఘట్టమైన ఎడ్లబండ్ల ప్రదర్శన సందర్భంగా భక్తులకు,రాగి జావా, వాటర్ ప్యాకెట్లు,తో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..తాము చదువుకున్న చదువులకు సార్థకత చేకూర్చుకుంటూ ముందుకు వెళ్తామని,ఒకరి కోసం ఒకరు తోడుగా ఉంటూ స్నేహితులం అందరం కలిసికట్టుగా ఉంటూ ఇతరులకు సేవా కార్యక్రమాలు చేపడుతూ అందరికీ ఆదర్శంగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బ్రహ్మం,సిద్దేశ్వర్,వీరేశం,అరవింద్, బేతయ్య,ఉమారాణి మమత, వీణ,లావణ్య,నీరజ,కరుణ, సరస్వతి,తదితరులు పాల్గొన్నారు.



## జొన్న, వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి: భూపాల్ రెడ్డి

**నారాయణఖేడ్,స్నేహిత ఎక్స్ ప్రెస్:** రైతులు పండించిన రబ్బీ పంటల కొనుగోలుకు ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మనూర్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీలలో ఒక్కటినీ అమలు చేయలేదని విమర్శించారు. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు.రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.15,000 ఇస్తామని ప్రకటించి, అమల్లో మాత్రం ఎకరాకు రూ.6,000 మాత్రమే ఇస్తూ రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. అలాగే రెండు పర్యాయాలు రైతు భరోసా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో జొన్నలు, కందులు, మొక్కజొన్న, వరి పంటలు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల వెంటనే అన్ని మండలాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి పంటకు ఎన్నికల హామీ ప్రకారం బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు విఠల్‌రావు పటేల్, మాజీ జడ్పీటీసీ నాగేందర్,మాజీ సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com